సాక్షి
వైఎస్సార్ జిల్లా
మంగళవారం । 16 । మే । 2023



ఇద్దరు దొంగల అరెస్టు

రాజంపేట, ఓబులవారిపల్లెలో జరిగిన దొంగతనాల్లో ఇద్దరు దొంగలను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.10,50,000 విలువ చేసే 208 గ్రాముల బంగారు నగలను రికవరీ చేశారు. - 8లో



ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

చాపాడు మండలంలోని విశ్వనాథపురం గ్రామంలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి బండలాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. - 8లో



బుగ్గవంకలో నీట మునిగి బాలుడి మృతి

చింతకొమ్మదిన్నె మండల పరిధి ఊటుకూరు సమీపంలోని బుగ్గవంకలో నీట మునిగి బాలుడు మృతి చెందాడు. - 8లో

దారికాచిన మృత్యువు

- వైఎస్సార్ జిల్లా ఏటూరు వద్ద రోడ్డు ప్రమాదం
- సంఘటన స్థలంలోనే ఏడుగురు దుర్మరణం
- డ్రైవర్ మినహా మిగిలిన వారంతా బంధువులే..

కాసేపట్లో గమ్యం చేరుకోవాల్సిన వారిని రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబళించింది. అక్కాచెల్లెళ్లు తమ కుటుంబాలతో తిరుమల దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఏడుగురు దుర్మరణం చెందారు. వీరిలో నలుగురు అక్కచెల్లెళ్లు, వారి ఇద్దరు కుమారులతో పాటు డ్రైవర్ ఉన్నారు. మృతుల్లో ఇద్దరు తాడిపత్రికి చెందిన తల్లీ కుమారుడు ఉన్నారు. ఎక్కడికెళ్లినా కలిసి వెళ్లే అక్కాచెల్లెళ్లు ఆఖరుకు మృత్యువులోనూ కలిసే వెళ్లిపోవడం అందరినీ కలచివేసింది. వివరాలిలా ఉన్నాయి.



ప్రమాదం జరిగిన కొండాపురం-తాడిపత్రి జాతీయ రహదారి (ఇన్‌సెట్) మృతులు తల్లీ కుమారుడు వెంకటలక్ష్మి, సునీల్‌కుమార్‌రెడ్డి (ఫైల్)

తాడిపత్రి అర్బన్/జమ్మలమడుగు/కొండాపురం : వైఎస్సార్ జిల్లా రైల్వే కొండాపురం నేదరపేటకు చెందిన వి.చెన్నారెడ్డి, లక్షుమమ్మ దంపతులకు ఆరుగురు కూతుళ్ల సంతానం. వీరిలో ఒకరు చనిపోయారు. మిగిలిన ఐదుగురిలో వెంకటలక్షుమ్మ పెద్ద ది. ఈమె భర్త కంచం ప్రసాద్‌రెడ్డి నాలుగేళ్ల క్రితం గుండెపోటుతో మరణించాడు. కంచం వెంకటలక్షుమ్మ (55) చిన్నకుమారుడు సునీల్‌కుమార్‌రెడ్డి (27)తో కలిసి తాడిపత్రి కృష్ణాపురం నాలుగో రోడ్డులో అద్దె ఇంటిలో నివాసముంటోంది. ఈమె పెద్ద కుమారుడు సురేంద్రకుమార్‌రెడ్డి బళ్లారిలో వాటర్‌ప్లాంట్ నిర్వహిస్తూ అక్కడే నివాసముంటున్నాడు. అప్పుడప్పుడు తల్లిని చూసేందుకు తాడిపత్రి వచ్చి వెళ్తుంటాడు. చీరల వ్యాపారంతో పాటు టైలరింగ్ పని చేసే వెంకటలక్ష్మమకు చిన్న కుమారుడు సచివాలయ వలంటీర్‌గా పనిచేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటుండేవాడు.

అన్యోన్యతకు మారుపేరు ఆ అక్కాచెల్లెళ్లు..

వెంకటలక్ష్మమ్మ, ఆమె చెల్లెళ్లు ఎంతో అన్యోన్యంగా కలిసిమెలిసి ఉండేవారు. ఎక్కడికి వెళ్లినా అందరూ కచ్చితంగా కలిసివెళ్లేవారు. ఐకమత్యానికి ప్రతిరూపాలుగా ఉన్న వెంకటలక్ష్మమ్మ, ఆమె ముగ్గురు చెల్లెళ్లు బళ్లారికి చెందిన సిరయ్యగారి లక్ష్మీదేవి అలియాస్ బుజ్జి (39), కాటసాని సుభద్ర (35), వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగుకు చెందిన కాటసాని సుమలత(38) తిరుమల శ్రీవారి దర్శనం వెళదామని నిర్ణయించుకున్నారు. శనివారం అద్దె తూఫాన్ వాహనంలో అక్కచెల్లెళ్లు తమ కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు వెళ్లారు. స్వామికి మొక్కులు చెల్లించుకుని.. ఆనందంగా తిరుగుపయనమయ్యారు. వైఎస్సార్ జిల్లా రైల్వే కొండాపురం మండలం ఏటూరు గ్రామ సమీపంలోని బ్రిడ్జి వద్ద వీరి వాహనాన్ని ఎదురుగా వచ్చిన లారీ బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటలక్ష్మమ్మ, ఆమె కుమారుడు సునీల్‌కుమార్‌రెడ్డి, చెల్లెళ్లు లక్ష్మీదేవి, సుమలత, సుభద్ర,తో పాటు సుభద్ర కుమారుడు లిఖిత్‌కుమార్‌రెడ్డి(11), వైఎస్సార్ జిల్లా లింగాల మండలానికి చెందిన డ్రైవర్ సుధాకర్‌రెడ్డి దుర్మరణం చెందారు. అర గంటలో తాడిపత్రికి చేరుకోవాల్సిన వారంతా విగతజీవులై రావడం బంధువుల్లో తీవ్ర విషాదం నింపింది.ఈ ప్రమాదంలో మరో ఐదుగురు గాయపడ్డారు. తల్లి, తమ్ముడి మృతదేహాలను చూసి సురేంద్రకుమార్‌రెడ్డి గుండెలవిసేలా రోదించారు. నన్ను అనాథను చేసి వెళ్లిపోతిరా.. దేవుడా ఎంత పనిచేశావయ్యా.. అంటూ విలపించాడు.

ఆస్పత్రిలో ఆర్తనాదాలు

యాడికి : తిరుమల నుంచి తాడిపత్రికి వస్తున్న తూఫాన్ వాహనం వైఎస్సార్ జిల్లా ఏటూరు సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను సమీపంలోని తాడిపత్రి ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులు, మృతుల కుటుంబ సభ్యుల ఆర్తానాదాలతో పరిసరాలు దద్దరిల్లాయి. మృతదేహాలు గుర్తించలేనంతగా ఉండటంతో బంధువులు, కటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. తాడిపత్రిలో క్రిష్టాపురం నాలుగో రోడ్డులో ఉన్న వెంకటలక్ష్మమ్మ(55), కుమారుడు, వలంటీర్ అయిన సునీల్ కుమార్‌రెడ్డి(27)ల మృతదేహాలను చూసేందుకు కాలనీవాసులతో పాటు సచివాలయ సిబ్బంది తరలివచ్చారు. ప్రథమ చికిత్స అనంతరం క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

డ్రైవర్‌గా వెళ్లి మృత్యుఒడికి

లింగాల : జిల్లాలోని కొండాపురం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన భూమిరెడ్డి సుధాకర్‌రెడ్డి కొంతకాలంపాటు లింగాల మండలం అమగంపల్లెలో నివాసం ఉన్నారు. భార్యాభర్తలు విడిపోవడంతో సుధాకర్‌రెడ్డి రెండో వివాహాన్ని పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె గ్రామంలో చేసుకున్నారు. అయితే ఆయన సోదరికి అమగంపల్లె గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహం చేయడంతో ఆయన కొన్నిరోజులపాటు అక్కడే ఉన్నారు. ఆయన తండ్రి నారాయణరెడ్డి గతంలోనే మృతి చెందాడు. ప్రస్తుతం తల్లి నారాయణమ్మ అమగంపల్లెలోనే కుమార్తె వద్ద ఉంటోంది. సుధాకర్‌రెడ్డి తాడిపత్రిలోని చేనేత కాలనీలో నివాసముంటున్నాడు. తుఫాను డ్రైవర్‌గా వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు.

మృతి చెందిన మహిళ అంత్యక్రియలు పూర్తి

కొండపురం మండలం ఏటూరు చిత్రావతి బ్రిడ్జిసమీపాన ఉన్న మలుపు వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో ఏడుగురు మృతి చెందారు. వీరిలో మైలవరం మండల కేంద్రానికి చెందిన మార్తల సుమలత (38) మృతి చెందింది. సోమవారం రాత్రి మైలవరంలో ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. బంధువులు, స్థానికులు తరలివచ్చి భర్త బాబుల్‌రెడ్డికు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాబుల్‌రెడ్డి ఎల్ఐసి ఏజంట్‌గా ఉంటున్నాడు. పిల్లల చదువు కోసం జమ్మలమడుగు పట్టణంలో కాపురం ఉంటున్నాడు. సుమలతకు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు.

సంఘటన స్థలం పరిశీలన



సంఘటన స్థలాన్ని వైఎస్సార్‌జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పరిశీలించారు.ఈ సందర్భంగా స్థానిక డీఎస్పీ నాగరాజుతో మాట్లాడారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సంఘటనపై ఎస్పీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.క్షత గాత్రుల పరిస్థితి గురించి ఆరా తీశారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



అనంతపురం క్రైం : వైఎస్సార్ జిల్లా రైల్వే కొండాపురం మండలం ఏటూరు బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి అనంతపురంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని కలెక్టర్ గౌతమి సోమవారం పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ మధుసూదన్, డీఐఓ డాక్టర్ యుగంధర్, తదితరులు ఉన్నారు.

న్యూస్‌రీల్

వైవీయూ వీసీతో ఎస్‌కేయూ వీసీ భేటీ



వైవీయూ వీసీతో సమావేశమైన ఎస్‌కేయూ వీసీ

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్‌తో అనంతపురం ఎస్‌కేయూ వైస్ చాన్సలర్ ఆచార్య ఎం.రామకృష్ణారెడ్డి భేటీ అయ్యారు. సోమవారం వైవీయూలోని వీసీ చాంబర్‌లో ఇరువురు సమావేశమై పరిపాలన పరమైన అంశాలను చర్చించారు. అనంతరం ఎస్‌కేయూ వీసీని గౌరవపూర్వకంగా సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ఐటీఐ అభ్యర్థులకు సెంచరీ ప్లైవుడ్‌లో ఉద్యోగాలు

కడప ఎడ్యుకేషన్ : బద్వేల్‌లో స్థాపించబడిన సెంచరి ప్లైవుడ్ సంస్థలో ఐటీఐ ఉత్తీర్ణులైన పురుష అభ్యర్థులకు ఉద్యోగ అవకాశం కల్పించబడుతుందని ప్రభుత్వ డీఎల్‌టీసీ ప్రిన్సిపల్, ప్రభుత్వ మైనార్టీ ఐటీఐల జిల్లా కన్వీనర్ జ్ఞానకుమార్ తెలిపారు. అభ్యర్థులు 2020, 2021, 2022 సంవత్సరంలో ఐటీఐ ఉత్తీర్ణత అయి 18 నుంచి 28 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఉండాలన్నారు. ఐటీఐలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, టర్నర్, మెషినిస్టు, వెల్డర్, డీజిల్ మెకానిక్, మోటర్ మెకానిక్ కోర్సులకు చెందిన ఆసక్తి కలిగిన వారు ఈనెల 19వ తేదీన కడపలోని ప్రభుత్వ డీయల్‌టీసీ/ఐటీఐ నందు ఉదయం 9.30 గంటలకు హాజరుకావాలన్నారు. విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, ఫొటోతో రెండు సెట్లు జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని తెలిపారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి



మాట్లాడుతున్న మెప్మా పీడీ సురేష్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాల్లోని సంక్షేమ ఫలాలను అర్హులకు అందించడంలో మెప్మా ఆర్పీలు కీలకపాత్ర పోషించాలని మెప్మా పీడీ సురేష్ రెడ్డి తెలిపారు.సోమవారం నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో మెప్మా ఎండీ విజయలక్ష్మి ఆదేశాల మేరకు వైయస్సార్, అన్నమయ్య జిల్లాల్లోని రీసోర్స్ పర్సన్లకు జిల్లా స్థాయి రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి బ్యాచ్‌కు సంబంధించి జమ్మలమడుగు, బద్వేలు, ఎర్రగుంట్ల మున్సిపాలిటీలోని రిసోర్స్ పర్సన్స్‌కు రెండు రోజులపాటు శిక్షణ ఉంటుందని, మిగిలిన మున్సిపాలిటీలకు ఈ నెల 31 వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ప్రతి మున్సిపాలిటీలోని స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేసేందుకు ఆర్పీలు కృషి చేయాలన్నారు. సంఘ సమావేశాల పుస్తక నిర్వహణలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలన్నారు. రెండు రోజులు పాటు జరిగే శిక్షణ కార్యక్రమంలో మెప్మా, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై పూర్తిస్థాయిలో తరగతులు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మెప్మా అధికారులు నాగరాజు, గోపీనాథ్, ఐటీ యాంకర్ పర్సన్ శంకర్ ప్రసాద్, జిల్లా రిసోర్స్ పర్సన్స్ జోసఫ్, శోభ, చంద్ర శేఖర్, బద్వేలు జమ్మలమడుగు సీపీఎం గంగులయ్య, అయ్యవారయ్యతోపాటు పలువురు ఆర్పీలు పాల్గొన్నారు.

ఎండ ప్రచండం

– కడపలో 43.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

కడప అగ్రికల్చర్ : జిల్లాలో సోమవారం ఎండలు అదరగొట్టాయి. జనాలు బెంబేలెత్తిపోయారు. కడపలో 43.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కొండాపురం మండలంలోని అనంతపురం గ్రామంలో 43.2, సింహాద్రిపురంలో 42.4, బద్వేల్, పోరుమామిళ్ల మండలం కొత్రపాటుపల్లెలో 42, ఒంటిమిట్టలో 41.9, వల్లూరులో 41.8, బికోదూరు మండలం కామకుంట, పొద్దుటూరు మండలం చౌడూరులో 41.7, కలసపాడులో 41.6, సిద్దవటంలో 41.4, కమలాపురం, పెద్దముడియం మండలం దిగువ కల్వట్ల, పోరుమామిళ్లలో 41.3, పెద్దముడియం మండలం పెద్ద పసుపులలో 41.2, సీకేదిన్నె మండలం మూలవంక, జమ్మలమడుగు, బికోదూరు, కాశినాయన మండలం వరికుంట్ల, బద్వేల్ మండలం కొంగలవీడులో 41.1, సింహాద్రిపురం మండలం సుంకేసుల, రాజుపాలెం మండలం ఉప్పలూరు, పెద్దముడియం మండలం నెమళ్లదిన్నె, గోపవరం మండలం మడకలవారిపల్లె 41 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.ఈ పరిస్థితి జిల్లాలో మరో నాలుగు రోజులపాటు కొనసాగనున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) పోగ్రాం కోఆర్డినేటర్ వీరయ్య, కేవీకే వాతావరణ విభాగ శాస్త్రవేత్త స్వామి చైతన్య తెలిపారు. రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

చర్చిని సందర్శించిన ఇంగ్లాండ్ బృందం



ఇంగ్లాండ్ బృందంతో చర్చి కమిటీ సభ్యులు

కలసపాడు : కలసపాడులోని సగిలేరు నడి ఒడ్డున ఉన్న పరిశుద్ధ పేతురు పరిశుద్ధ పౌలు చర్చిని సోమవారం ఇంగ్లాండ్ దేశానికి చెందిన దిరైట్ రెవరెండ్ గావిన్ అండ్రూ కొలిన్ (బిషప్ ఇన ఆక్స్‌ఫర్డ్ డయాసిస్), రెవరెండ్ శారా, రెవరెండ్ జేమ్స్‌లు సందర్శించారు. 136 సంవత్సరాల చర్చి విశిష్టతను విచారణ గురువులు, కమిటీ సభ్యులు వారికి తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్, ఇన్‌చార్జి డీనరీ చైర్మన్ రెవ.డాక్టర్ పి.ఎ.వరప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

టీబీ రహిత జిల్లాగా చేయండి

సిద్దవటం : టీబీ, లెప్రసీ వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స అందించి 2025కల్లా జిల్లాను టీబీ రహితంగా మార్చాలని వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వల్లి తెలిపారు. సిద్దవటం మండలం ముమ్మడిగుంట పల్లెలో సోమవారం జరిగిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని సోమవారం ఆయన తనిఖీ చేసి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన హైరిస్క్ ఉన్న గర్భవతులను ఇంటికెళ్లి పరామర్శించారు. బాలింతలను కూడా 50 రోజుల పాటు గమనించాలని ఏఎన్ఎం లకు ఆదేశించారు. బి.పి, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడా మందులను అందజేయాలన్నారు. అసంక్రమిత వ్యాధులను గుర్తించే సర్వే పూర్తి చేసి ప్రజలకు ఐడీలను ఇవ్వాలన్నారు. అనంతరం మాధవరం పీహెచ్‌సీని తనిఖీ చేశారు.



ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వల్లి

ప్రశాంతంగా ఈఏపీసెట్



కేఓఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో సిబ్బందితో చర్చిస్తున్న జేఎన్‌టీయూ ఉపకులపతి రంగ జనార్ధన

కడప ఎడ్యుకేషన్ : ఇంజినీరింగ్, అగ్రికల్చర్ ఫార్మసీ ప్రవేశాలకు కోసం సోమవారం జిల్లావ్యాప్తంగా నిర్వహించిన ఈఏపీసెట్ ప్రశాంతంగా జరిగింది. విద్యార్థులు గంటన్న ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. కడప, పొద్దుటూరు, రాజంపేటల్లో 9 పరీక్షా కేంద్రాల్లో ఉదయం, సాయంత్రం రెండు సెషన్లలో జరిగిన పరీక్షలకు 3182 మంది విద్యార్థులకుగాను 2988 మంది హాజరయ్యారు. 194 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

పరీక్షా కేంద్రం పరిశీలన

ఈఏపీసెట్ పరీక్షలో భాగంగా కేఓఆర్ఎం,కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన పరీక్షను అనంతపురం జేఎన్‌టీయూ ఉపకులపతి ప్రొఫెసర్ రంగజనార్ధన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లతోపాటు వసతులను పరిశీలించారు. అనంతరం అక్కడి పరీక్షా సిబ్బందితో పరీక్ష తీరుపై చర్చించి తగు సూచనలు సలహాలను ఇచ్చారు.

జిల్లాలోని పరీక్షా కేంద్రాల వివరాలు

పరీక్షా కేంద్రం	కేటాయించిన	హాజరు విద్యార్థులు	గైర్హాజరు
అన్నమాచార్య (కడప)	760	750	10
కేఎస్ఆర్ఎం	200	188	12
కేఓఆర్ఎం	516	477	39
స్విస్ట్	200	180	20
శ్రీనివాస	190	177	13
స్విస్ట్(చాపాడు)	460	419	41
ఎస్ఆర్ఐటి (ప్రొద్దుటూరు)	330	302	28
వాగ్దేవి	156	146	10
అన్నమాచార్య (రాజంపేట)	370	349	21

అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

కడప సెవెన్‌రోడ్స్ : స్పందన కార్యక్రమంలో ప్రజలు సమర్పించే అర్జీలను పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో అర్జీలను స్వీకరించి పరిశీలించారు. అనంతరం వాటిని పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులకు సిఫార్సు చేశారు. అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం ఉండాలని చెప్పారు. బియాండ్ ఎస్ఎల్ఏ, రీ ఓపెనింగ్ లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. జేసీ గణేష్‌కుమార్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు యదుభూషణరెడ్డి, ఆనందనాయక్ పాల్గొన్నారు.

సత్వరం స్పందించాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

కడప అర్బన్ : జిల్లాలో బాధితులు పోలీసుశాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో 'స్పందన' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ బాధితులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.

చదరంగం విజేతగా భగతీశ్వర్‌రెడ్డి



కడప స్పోర్ట్స్ : ఫిడే ఇంటర్నేషనల్ రేటింగ్ చెస్ టోర్నమెంట్ విజేతగా కమలాపురం పట్టణానికి చెందిన భగతీశ్వర్‌రెడ్డి నిలిచాడు. అనంతపురంలో ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించిన ఫిడే ఇంటర్నేషనల్ రేటింగ్ టోర్నమెంట్‌లో 9 రౌండ్లకు 8.5 పాయింట్లు సాధించి రూ.7వేలు నగదు బహుమతితో పాటు 68 రేటింగ్ పాయింట్లు సాధించాడు. ఈయన ప్రతిభ పట్ల జిల్లా చదరంగం అసోసియేషన్ కార్యదర్శి బి. అనీస్‌దర్బారీ అభినందనలు తెలిపారు.

ఉత్తమ విద్యకు ఆదర్శ

- మోడల్ స్కూళ్లలో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు
- జూన్ 11న ప్రవేశ పరీక్ష
- ఈనెల 25 వరకు దరఖాస్తుల స్వీకరణ

కడప ఎడ్యుకేషన్ : గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు సైతం కార్పొరేట్ స్థాయి విద్య అందించాలనే లక్ష్యంతో 2013లో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఏపీ మోడల్ స్కూళ్లను ప్రారంభించారు. వీటిల్లో సకల వసతులు, అత్యుత్తమ విద్యాబోధన అందిస్తుండటంతో నేడు పేద విద్యార్థులకు వరంగా మారాయి. ఈ పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. జిల్లాలో ప్రస్తుతం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలల్లో(మోడల్ స్కూళ్లు) 2023-24 విద్యా సంవత్సరానికిగాను 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఉమ్మడి వైఎస్సార్ జిల్లావ్యాప్తంగా 10 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో ప్రవేశానికి ఈ నెల 10వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 6వ తరగతిలో ప్రతి పాఠశాలకు 100 సీట్ల చొప్పున పది ఆదర్శ పాఠశాలల్లో 1000మందికి ప్రవేశాన్ని కల్పించనున్నారు.

దరఖాస్తు చేసుకోవడం ఇలా..

మండలాల్లోని ఆదర్శ పాఠశాలల్లో ఈ నెల 25 వరకు నెట్ బ్యాకింగ్ లేదా క్రెడిట్, డెబిట్ కార్డులను ఉపయోగించి పేమెంట్ గెట్‌వే ద్వారా పరక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది, కేటాయించిన జనరల్ నెంబర్ ఆధారంగా ఏదైనా ఇంటర్ నెట్ కేంద్రంలో www.cre.ap.gov.in.gov.in ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలి. తర్వాత పత్రాలను సంబంధిత మోడల్ పాఠశాలల్లో సమర్పించాలి. ఈ ప్రవేశ పరీక్ష కోసం ఓసీ, బీసీ విద్యార్థులు రూ. 150 ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ. 75 చెల్లించాల్సి ఉంటుంది. 5వ తరగతిస్థాయి సిలబస్‌తో తెలుగు, ఇంగ్లీషు మీడియంలలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు



ఖాజీపేటలో ఉన్న మోడల్ స్కూల్

ఇవీ అర్హతలు

ఓసీ, బీసీ విద్యార్థులు 2011 సెప్టెంబర్ 1 నుంచి 2013 ఆగస్టు 31వ తేదీ మధ్య పుట్టి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులైతే 2009 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31వ తేదీ మధ్య జన్మించి ఉండాలి. జిల్లాలో ప్రభుత్వ, లేక ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో నిరవధికంగా 2021-22, 2022-23 విద్యా సంవత్సరాలు చదివి ఉండాలి. 2023-23 విద్యా సంవత్సరంలో 5వ తరగతి చదువుతూ ప్రమోషన్ అర్హత పొంది ఉండాలి. దరఖాస్తు చేసుకోవడానికి వివరాలతో కూడిన సమచారంపత్రం కోసం www.cre.apgov.in/ apmr.ap.gov.in చూడొచ్చు.

ప్రతిభ, రిజర్వేషన్ ఆధారంగా....

జిల్లావ్యాప్తంగా జూన్ 11వ తేదీన ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆయా మోడల్ పాఠశాలల్లో పరీక్ష నిర్వహిస్తారు. ఓసీ, బీసీ విద్యార్థులు 35 మార్కులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 30 మార్కులు పొంది ఉండాలి. మార్కులు, రిజర్వేషన్ ప్రకారం ప్రవేశాలు కల్పిస్తారు. ప్రవేశ పరీక్ష అబ్జెక్టివ్ టైపులో ఉంటుంది. మరిన్ని వివరాలకు సమీపంలోని ఆదర్శ పాఠశాలల ప్రిన్సిపాల్, లేక జిల్లా, మండల విద్యాశాఖ అధికారిని సంప్రదించాలి. జూన్ 16న మెరిట్ జాబితాను ప్రకటిస్తారు. మెరిట్ జాబితాను బట్టి రోస్టర్ ప్రామాణికంగా సీట్లు కేటాయిస్తూ జూన్ 18న జాబితాను విడుదల చేస్తారు. 19న సర్టిఫికెట్లు పరిశీలనతోపాటు కౌన్సిలింగ్ ప్రక్రియ ఉంటుంది. జూన్ 21 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.


ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆదర్శ పాఠశాలల వివరాలు...

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో పది మోడల్ స్కూళ్లుంటాయి, ఇందులో ఖాజీపేట, వల్లూరు, కాశినాయన, చిన్నమండెం, రామాపురం, లక్కిరెడ్డిపల్లె, రాయచోటి, సంబేపల్లి, పుల్లంపేట, పెనగలూరు మండలాల్లో ఈ మోడల్ స్కూళ్లు ఉన్నాయి.

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి..

జిల్లావ్యాంగా ఉన్న మోడల్ స్కూళ్లలో 6వ తరగతి ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. ప్రవేశ పరీక్ష అనంతరం ప్రతిభ ఆధారంగా రిజర్వేషన్ నిబంధనల ప్రకారం సీట్లు కేటాయింస్తారు. ఇందులో ఓసీ, బసీ, ఎస్టీ, ఎస్సీ విద్యార్థులు వారి విద్య, వయసుకు అనుగుణంగా దరఖాస్తు చేసుకోవాలి. సీట్ల కేటాయింపు పారదర్శంగా జరుగుతుంది.

– మార్తాల వెంకటకృష్ణారెడ్డి, ఏపీ మోడల్‌స్కూళ్ల జేడీ, పాఠశాల విద్య ఆర్‌జేడీ.



వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్య

పెద్దతిప్పసముద్రం : వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. పెద్దతిప్పసముద్రం మండలంలోని రంగసముద్రంకు చెందిన జూటూరి గిరీష్ (25) జీవితంపై విరక్తి పెంచుకుని ఇంట్లోనే ఫ్యానుకు ఉరేసుకుని సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ కలహాల కారణంగానే ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ విషయంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పురుగుల నివారణ మందు తాగి..

పెద్దమండ్యం : పురుగుల నివారణ మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని సీగొల్లపల్లె పంచాయతీ కుడుములవారిపల్లెలో సోమవారం ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బుషిరెడ్డి కుళ్లాయిరెడ్డి వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. చిన్నమండ్యం మండలం కలిబండలో జరిగిన పాలేటమ్మ తిరునాలకు వెళ్లాడు. ఆదివారం రాత్రి ఇంటికి రాకపోవడంతో భార్య జయసుధ బంధువులకు ఫోన్ ద్వారా తెలియజేసింది. సోమవారం తెల్లవారుజామున పొలం వద్ద పురుగుల నివారణ మందు తాగి అపస్మారకస్థితిలో ఉండగా 108 ద్వారా రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కడప రిమ్స్‌కు తరలించగా అప్పటికే అతను మృతి చెందినట్లు డాక్టర్‌లు తెలిపారు. రెండు ఎకరాలలో టమాట పంట సాగు చేసి అప్పులు కావడంతో కుళ్లాయిరెడ్డి ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు



విశ్వనాథపురంలో బండలాగుతున్న ఎద్దులు

చాపాడు : మండలంలోని విశ్వనాథపురం గ్రామంలో వీరాంజనేయస్వామి ఆలయ 31వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి బండలాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం దండేడుపల్లి గ్రామానికి చెందిన రమేష్‌కుమార్‌రెడ్డి ఎద్దులు 2634 అడుగుల దూరం బండలాగి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాయి. చాపాడు మండలం చియ్యపాడుకు చెందిన వెంకటేశ్వర శర్మ ఎద్దులు 2,308 అడుగులు లాగి రెండో స్థానం, గోపవరం మండలానికి చెందిన నెమలయ్య ఎద్దులు 2,169 అడుగులు లాగి మూడో స్థానం, వేముల మండలం రంగోళిపల్లి మండలానికి చెందిన మూలె రామసుబ్బారెడ్డి ఎద్దులు 2,144 అడుగులతో నాలుగో స్థానం సాధించాయి. నందాల టౌన్, ప్రొద్దుటూరు మండలం ఖాదర్‌బాద్‌కు చెందిన అనుషారాణి క్రాంతి కుమార్, నాగసుబ్బారెడ్డి ఎద్దులు 2137 అడుగులు లాగి ఐదో స్థానం, నంద్యాల జిల్లా రోళ్లపాడుకు చెందిన పేరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఎద్దులు 1900 అడుగులు లాగి ఆరో స్థానం, వైఎస్‌ఆర్ జిల్లా జంగంపల్లెకు చెందిన పుత్తా నాగసుబ్బారెడ్డి ఎద్దులు 1885 అడుగులతో ఏడో స్థానంలో నిలిచాయి. వీటితోపాటు మరో మూడు జతల ఎద్దులు గెలుపొందాయి. గెలుపొందిన ఎద్దుల యజమానులకు వరుసగా రూ.60 వేలు, రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, 20 వేలు, 10 వేలు, రూ.5 వేలు చొప్పున నగదు అందించారు. బండలాగుడు పోటీలకు వచ్చిన ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీరాంజనేయస్వామి ఉత్సవ నిర్వాహకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలు వీరే

ప్రొద్దుటూరు కల్చరల్ : వసంతపేటలోని కోదండరామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాల్లో భాగంగా సోమవారం రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి వృషభరాజముల బండలాగుడు పోటీలు నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 14 జతల ఎద్దులు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. బండలాగుడు పోటీల్లో వేటపాళెంకు చెందిన ఆర్‌కే.శిరీషచౌదరి, శివకృష్ణ చౌదరి (బాపట్ల) ఎద్దులు 3135 అడుగులు లాగి ప్రథమ బహుమతి రూ.1,50,116, ఎ.ప్రసన్నరెడ్డి (రంగారెడ్డి) ఎద్దులు 2847 అడుగులు లాగి ద్వితీయ బహుమతి రూ.1,00,116, మార్తల చంద్ర ఓబుళరెడ్డి చౌటపల్లె (వైఎస్సార్) ఎద్దులు 2801 అడుగులు లాగి తృతీయ బహుమతి రూ.75,000, నాగయ్య పిఠర్‌పల్లి (నంద్యాల) ఎద్దులు 2719 అడుగులు లాగి నాలుగవ బహుమతి రూ.50,116 సాధించాయి. మార్తల చంద్ర ఓబుళరెడ్డి చౌటపల్లె (వైఎస్సార్) ఎద్దులు 2688 అడుగులు లాగి ఐదవ బహుమతి రూ.30,116, మేకల వెంకటరాముడు (బేతంచర్ల) ఎద్దులు 2685 అడుగులు లాగి ఆరవ బహుమతి రూ.20,116, వెలవలి కమ్మసాబ్ గారి రసూల్ (వైఎస్సార్) ఎద్దులు 2612 అడుగులు లాగి ఏడవ బహుమతి రూ.15,116, ఆనంవారిపల్లె జగన్‌మోహన్‌రెడ్డి (వైఎస్సార్) ఎద్దులు 2609 అడుగులు లాగి 8వ బహుమతి రూ.10.116 పొందాయి. అలాగే పోటీల్లో పాల్గొన్న ప్రతి ఎద్దుల జతకు ప్రోత్సాహక బహుమతిగా రూ.5000లను అందజేశారు. బహుమతులను కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు గెలుపొందిన ఎద్దుల యజమానులకు అందించారు.

హత్య కేసులో యావజ్జీవ శిక్ష



నిందితుడు రామాంజనేయులు

ప్రొద్దుటూరు క్రైం : రోకలి బండతో దస్తగిరి అనే వ్యక్తిని కొట్టి హత్య చేసిన కేసులో చిట్టిబోయిన రామాంజనేయులుకు ప్రొద్దుటూరు రెండవ అదనపు జిల్లా కోర్టు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.5 లక్షల జరిమానా విధించింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాజుపాళెం మండలంలోని కొర్రపాడు గ్రామంలో 2021 మే 9న కొందరు యువకులు క్రికెట్ ఆడుతున్నారు. ఈ క్రమంలో ఆటలో మనస్పర్థలు రావడంతో చిట్టిబోయిన రామాంజనేయులు అనే వ్యక్తి చరణ్ అనే యువకుడిని కొట్టాడు. చరణ్ ఈ విషయాన్ని తన చిన్నాన్న అయిన దస్తగిరికి చెప్పాడు. దీంతో చరణ్‌ను కొట్టిన విషయాన్ని అడిగేందుకు దస్తగిరి.. రామాంజనేయులు ఇంటి వద్దకు వెళ్లాడు. అక్కడ జరిగిన వాగ్వాదంలో రామాంజనేయులు రోకలి బండ తీసుకొని దస్తగిరి తలపై కొట్టడంతో తీవ్ర రక్తస్రావమై మృతి చెందాడు. చరణ్ తండ్రి చీలి సుధాకర్ ఫిర్యాదు మేరకు అప్పటి రాజుపాళెం ఎస్‌ఐ కృష్ణంరాజునాయక్ కేసు నమోదు చేశారు. ప్రొద్దుటూరు రెండవ అదనపు జిల్లా కోర్టులో ఈ కేసు వాదనలు జరుగుతూ వచ్చాయి. తుది విచారణలో భాగంగా నేరం రుజువు కావడంతో నిందితుడు రామాంజనేయులుకు యావజ్జీవ కారాగార శిక్షతోపాటు రూ. 5 లక్షలు జరిమానా విధిస్తూ రెండవ అదనపు జిల్లా కోర్టు జడ్జి జీఎస్ రమేష్‌కుమార్ సోమవారం తీర్పు చెప్పారు. రూ. 5 లక్షలు చెల్లించని పక్షంలో మరో అయిదేళ్ల పాటు శిక్ష అనుభవించాలని జడ్జి తీర్పులో పేర్కొన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.రాంప్రసాద్‌రెడ్డి ఈ కేసును వాదించారు. సాక్ష్యాధారాలతో ముద్దాయికి శిక్ష పడేలా కృషి చేసిన ఏఎస్పీ ప్రేరణాకుమార్, అప్పటి రూరల్ సీఐ మధుసూదన్‌గౌడ్, కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రావు, అప్పటి రాజుపాళెం ఎస్‌ఐ కృష్ణంరాజునాయక్, ప్రస్తుత ఎస్‌ఐ రాజగోపాల్, కోర్టు కానిస్టేబుల్ బాబాషాను జిల్లా ఎస్పీ అన్బురాజన్ అభినందించారు.

కడపలో ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య



జిల్లా శివప్రసాద్ (ఫైల్)

కడప అర్బన్ : కడప నగరం రిమ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వైఎస్‌ఆర్ సర్కిల్ సమీపాన ఉన్న ఓ లాడ్జిలో జిల్లా శివప్రసాద్ (35) అనే ఏఆర్ కానిస్టేబుల్ (ఏఆర్ పీసీ 2343) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, బంధువుల ప్రాథమిక సమాచారం మేరకు వివరాలిలా వున్నాయి. 2009 బ్యాచ్‌కు చెందిన శివప్రసాద్ ప్రకాష్ నగర్‌లో నివాసం వుంటున్నాడు. ఆయనతో పాటు భార్య మల్లేశ్వరి వున్నారు. ఆయనకు ఆర్థిక సమస్యలు వున్నట్లు సమాచారం. ఏఆర్ విభాగంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఈయన గతంలో కడప ఒన్‌టౌన్ సీఐ టి.వి సత్యనారాయణ దగ్గర గన్‌మెన్‌గా విధులను నిర్వహించారు. ఇటీవల కాలంలో పోలీసు కళాజాగృతి బృందంతోపాటు వున్నాడని సమాచారం. ఈక్రమంలో ఈ నెల 14 తేదీన సాయంత్రం ఇంటి నుంచి బయటకు వచ్చిన శివప్రసాద్ నేరుగా వెళ్లి కడప నగర శివార్లలోని ఓ లాడ్జిలో రూం తీసుకుని వున్నాడు. సోమవారం సాయంత్రం లాడ్జి నిర్వాహకులు అతను వున్న గది వద్దకు వెళ్లి ఖాళీ చేయాలని అడిగేందుకు ప్రయత్నించారు.

ఎంతసేపటికీ పలుకక పోవడంతో గమనించారు. గది తాళాలు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా శివప్రసాద్ ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రిమ్స్ పిఎస్ సీఐ కె.రామచంద్ర ఆధ్వర్యంలో ఎస్‌ఐ నారాయణ తమ సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. అతని భార్య మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు రిమ్స్ పీఎస్ ఎస్‌ఐ నారాయణ తెలియజేశారు.

పట్టపగలే ఇంటిలో చోరీ



బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడేసిన దుండగులు

మదనపల్లె : పట్టపగలే ఇంటి తలుపులు పగలగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి చోరీకి పాల్పడి రూ.4 లక్షల విలువ చేసే నగలు, నగదు అపహరించిన సంఘటన సోమవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. బాధితులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక నీరుగట్టువారిపల్లెలోని శ్రీనివాసులు, సుగుణ వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. సోమవారం ఉదయం వారిద్దరూ ఇంటికి తాళం వేసి పొలం వద్దకు వెళ్లారు. తిరిగి మధ్యాహ్నం రాగా ఇంటి తాళం పగలగొట్టి ఉండటం, వస్తువులు చిందరవందరగా పడి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 35 గ్రాముల బంగారు నగలు, రూ.2.70 లక్షలు చోరీ జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

బార్లపల్లెలో..

మండలంలోని చీకలబైలు పంచాయతీ బార్లపల్లెకు చెందిన ప్రసాద్‌రెడ్డి ఇంట్లో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి రూ.5 లక్షల విలువ చేసే నగలు, నగదు అపహరించారు. ఈ మేరకు బాధితుడు సోమవారం తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాలూకా సీఐ సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

బుగ్గవంకలో నీట మునిగి బాలుడి మృతి

చింతకొమ్మదిన్నె : మండల పరిధి ఊటుకూరు సమీపంలోని బుగ్గవంకలో నీట మునిగి బాలుడు మృతి చెందాడు. ఎస్‌ఐ బి.అరుణ్‌రెడ్డి సోమవారం తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కడపలోని ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన ప్రవీణ్(17) ఈత కొట్టడానికి ఊటుకూరు సమీపంలోని బుగ్గవంకకు వచ్చాడు. అక్కడ నీట మునిగి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.



ఇద్దరు దొంగల అరెస్టు

రాజంపేట : సబ్‌డివిజన్ పరిధిలోని రాజంపేట, ఓబులవారిపల్లెలో జరిగిన దొంగతనాల్లో ఇద్దరు దొంగలను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.10,50,000 విలువ చేసే 208 గ్రాముల బంగారు నగలను రికవరీ చేశారు. సోమవారం ఎస్‌డీపీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాజంపేట డీఎస్పీ వీఎన్‌కే చైతన్య వివరాలు వెల్లడించారు. రాజంపేట పట్టణం నలంద స్కూల్ సమీపంలోని మెహరబాబనగర్‌లో నివాసం ఉంటున్న జోజిరెడ్డి అశోక్‌రెడ్డి ఇంటిలో చోరీ సంఘటనకు సంబంధించి సమ్మద్‌హాల్ సమీపంలోని ఎస్వీనగర్‌కు చెందిన బాలిపోగు ఇజ్రాయిల్‌ను అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ.4.50,00 విలువ కలిగిన బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. ఓబులవారిపల్లె, రాజంపేట అర్బన్, రైల్వేకోడూరు, మన్నూరు పోలీసుస్టేషన్లలో పరిధిలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన పల్లెపాగ వెంకటసుబ్బయ్యను అరెస్టు చేశారు. పుల్లంపేట మండలం కోండ్లోపల్లె అరుంధతీవాడకు చెందిన వెంకటసుబ్బయ్య నుంచి రూ.6 లక్షల విలువ చేసే 120 గ్రాముల బంగారు నగలను రికవరీ చేశారు. నిందితులిద్దరినీ కోర్టులో హాజరు పరిచి, తర్వాత రిమాండ్‌కు తరలించారు. జిల్లా ఎస్పీ రెడ్డి గంగాధర్‌రావు ఆదేశాల మేరకు డీఎస్పీ చైతన్య పర్యవేక్షణలో సీఐ నరసింహారావు (రాజంపేట అర్బన్), ఎస్.విశ్వనాథరెడ్డి (రైల్వేకోడూరు సీఐ), ఎస్‌ఐలు పి.వెంకటేశ్వర్లు, శ్రీకాంత్ రెడ్డి, వీఎల్ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో స్పెషల్ టీంగా ఏర్పడి ఈ కేసులు ఛేదించారు.

రూ.33 లక్షల మొబైల్ ఫోన్లు రికవరీ

రాయచోటి : పోలీసు శాఖ చేపట్టిన మొబైల్ ఫోన్ల రికవరీ సత్ఫలితాలను ఇస్తోందని అన్నమయ్య జిల్లా ఎస్పీ గంగాధర్ రావు అన్నారు. సోమవారం సాయంత్రం ఎస్పీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మూడో విడతలో రికవరీ చేసిన రూ.33 లక్షల విలువ గల 165 మొబైల్ ఫోన్ల రికవరీని ఎస్పీ వివరించారు. అరెస్ట్ చేసిన ఇద్దరు మొబైల్ ఫోన్ల దొంగలతోపాటు సెల్‌ఫోన్లను కార్యాలయంలో ప్రవేశ పెట్టి మొబైల్ రికవరీ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడు పర్యాయాలలో రూ.82 లక్షల విలువజేసే 404 సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశామన్నారు. గత రెండు పర్యాయాలలో 210 సెల్‌ఫోన్లను రికవరీ చేయగా ప్రస్తుతం 165 సెల్‌ఫోన్లు రికవరీ అయ్యాయని చెప్పారు. దొంగల నుంచి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లను బాధితులకు అప్పగించడం జరిగిందన్నారు. అలాగే సెల్‌ఫోన్ దుకాణాలలో రసీదులు లేకుండా విక్రయిస్తున్న వారిపైన కూడా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇప్పటికే రాయచోటి పట్టణ పరిధిలో ఎలాంటి రసీదులు లేకుండా విక్రయిస్తున్న మొబైల్ షోరూంపై దాడి చేసి విచారణ చేపట్టామన్నారు. ఆంధ్రప్రదేశ్ మాత్రమే కాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన బాధితుల ఫోన్లను రికవరీ చేసి ఇవ్వడంతో బాధితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నవారు జిల్లా పోలీస్ వాట్సప్ నంబరు. 8688830012కు హాయ్ అని టైప్ చేయడం ద్వారా లేదా https://forms.gle/CCWgUgkATEbses4B9 లింక్ నొక్కడం ద్వారా పోయిన మొబైల్స్ ఫిర్యాదుల స్వీకరణకు ఎఫ్ఐఆర్ కట్టకుండా, పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండా సులభతరం చేశామన్నారు. అలాగే మొబైల్ వివరాలను తెలియజేస్తే బాధితులకు త్వరితగతిన అందజేసేందుకు కృషి చేస్తున్నామని ఎస్పీ చెప్పారు. మొబైల్స్ ట్రేస్ చేసిన సైబర్ క్రైమ్, టెక్నికల్ ఎనాలిసిస్ వింగ్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

వైట్ కాలర్ నేరాలపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో అక్కడక్కడా వైట్ కాలర్ నేరాల జాడలు కనిపిస్తున్నాయని, వాటి నివారణకు పోలీస్ యంత్రాంగం ప్రత్యేకత సాధించిందని జిల్లా ఎస్పీ తెలిపారు.